క్లుప్తంగా

26న పుష్కరాల ముగింపు కార్యక్రమాలు

కాళేశ్వరం: రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న సరస్వతినది పుష్కరాలు 26తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమాలను సాయంత్రం 6గంటలకు సరస్వతిఘాటు వద్ద కాళేశ్వరాలయం నుంచి తరలివస్తారు. సాయంత్రం 6.05 గంటలకు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ మాట్లాడుతారు. 6.10గంటలకు పుష్కరాలపై నాగఫణిశర్మ ప్రవచిస్తారు. 6.30 గంటలకు పుష్కరాలపై మంత్రులు, వీఐపీలు మాట్లాడుతారు. రాత్రి 7గంటలకు సరస్వతినదికి నవరత్నమాల హారతిని ఇస్తారు.7.45గంటలకు డ్రోన్‌తో షో నిర్వహిస్తారు. 7.55గంటల నుంచి 8.10గంటల వరకు క్రాకర్స్‌తో సంబురాలు ముగింపు సంబురాలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పరిహారం అందజేత



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన నిట్టూరి శంకరయ్యకు చెందిన ఎద్దును రెండు నెలల కిందట పులిదాడి చంపింది. దీంతో శుక్రవారం సీసీఎఫ్ డాక్టర్ ప్రభాకర్, డీఎఫ్ఓ నవీన్‌రెడ్డిల చేతుల మీదుగా రూ.40వేల పరిహారం రైతుకు అందజేశారు. రేంజర్ రవి, ఎఫ్ఎస్ఓ తిరుపతి ఉన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి



రేగొండ: విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని రాష్ట్ర స్థాయి విద్యా పరిశీలకులు దామోదర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షణ తరుగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి విద్యా పరిశీలకులు దామోదర్, అబ్దుల్‌హై హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకట్టుకునేలా, వారిలో ఆసక్తి పెంచే విధంగా బోధన జరగాలని, ఆధునిక సాంకేతికతను జోడించి బోధించడానికి కృషి చేయాలన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్ పింగళి విజయపాల్‌రెడ్డి, ప్రసాద్, అఫ్రజ్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు బూర్గు రవి ఆదేశాలతో (టీఎన్‌జీఓవీఏ) వెటర్నరీ ఫోరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి దశరథ రామారావు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వెటర్నరీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్ టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి అభిషేక్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీమ్ పాషా, హన్మకొండ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న స్టాళ్లు



బురదమయంగా ఉన్న స్టాళ్లకు వెళ్లే దారి



గిరాకీ లేక వెలవెలబోతున్న స్టాళ్లు

- వర్షంతో సాళ్లలో బురదమయం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు

పలిమెల/చిట్యాల: కాళేశ్వరం సరస్వతి నది పుష్కర ఘాట్ సమీపంలో భక్తుల సౌకర్యార్థం, మహిళా సాధికారత కోసం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళ స్వయం ఉపాధి విక్రయశాలలు గిరాకీ లేక వెలవెలబోతున్నాయి. మొదటి మూడు రోజులు గిరాకీ అంతంతే ఉండగా వ్యాపారం పుంజుకుంటున్న సమయంలో అకాల వర్షాలతో భక్తులు స్టాల్స్ వైపు కన్నెత్తి చూడటం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టాల్‌లోకి వెళ్లే దారిలో బురదమయం కావడంతో భక్తులు ఇటు చూసిన దాఖలాలు లేవు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పలు స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన బట్టల షాపుల్లోని కొన్ని చీరలు, డ్రెస్సులు తడిచిపోయాయి. పలువురు వ్యాపారులు ఆశించిన గిరాకీ లేకపోవడంతో ఇప్పటికే స్టాల్స్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయారు.

స్టాల్ వద్దే వంట చేసుకుంటున్నాం..



ప్రభుత్వం ఏర్పాటు చేసి భోజనం కోసం వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఒకరం వెళితె మరోకరం స్టాల్ వద్దే ఉండాల్సి వస్తుంది. స్టాల్స్ వద్ద ఉన్న వారికి పార్సల్ కూడా ఇవ్వడం లేదు. దీంతో మేమే స్వయంగా వంట చేసుకుంటున్నాం. ఇటీవల కురిసిన వర్షాలకు స్టాల్స్‌లో ఉన్న కొన్ని చీరలు తడిచిపోయాయి. దీంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది.

-లావణ్య, దుగ్గొండి, వరంగల్ జిల్లా

టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేశాం..



డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో మిల్లెట్స్ సెంటర్ ఏర్పాటు చేసి రా ఫుడ్ మెటీరియల్ అమ్మగా ఆశించిన గిరాకీ లేదు. పుష్కర స్నానానికి భక్తులు అధికంగా వస్తూ టిఫిన్స్ అడుగుతుండడంతో మేము టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేశాం. మిల్లెట్ సెంటర్ కంటే టిఫిన్ సెంటర్ గిరాకీ పరవాలేదు.

-ఉమాదేవి, చెల్పూర్

ఆశించిన గిరాకీ లేదు



గత రెండు రోజుల నుంచి ఆశించిన మేరకు గిరాకీ లేక ఇబ్బందికరంగా మారింది. వర్షం రావడంతో స్టాల్స్ కొంత భాగం బురదమయమైంది. దీంతో స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన బట్టలు కొనడానికి భక్తులు ఇటు వైపు రావడం లేదు. ఆశించిన మేరకు గిరాకీ లేకపోవడంతో నష్టాలే మిగులుతున్నాయి.

- విజయలక్ష్మీ, యాదాద్రి భువనగిరి జిల్లా

వర్షానికి ఇబ్బందులు పడ్డాం..



రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో స్టాల్స్‌లో పడుకోవడానికి వీలు లేకపోవడంతో వస్త్రాలను, సామాన్లను స్టాల్స్‌లో వదిలేసి పక్కనే ఉన్న టెంట్ సిటీలోని హాల్లో తలదాచుకున్నాం.

-సూరి, హన్మకొండ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై గీతారాథోడ్



మాట్లాడుతున్న ఎస్సై గీతారాథోడ్

కాటారం: సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని కాటారం ప్రొబేషనరీ ఎస్సై గీతారాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ మోసాల గూర్చి వివరించారు. ఆన్‌లైన్‌లో సైబర్ నేరాలతో మోసపోవద్దని, ఏదైనా తెలియక మోసపోయినట్లయితే వెంటనే 1930 కాల్ చేసి తక్షణమే ఫిర్యాదు చేయాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల నుంచి ఎలాంటి మెసేజ్‌లు, కాల్స్ వచ్చిన స్పందించవద్దని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, రిసోర్స్‌పర్సన్లు నడిపెల్లి సురేశ్, భగవాన్‌రెడ్డి, సత్యనారాయణ, గోపి నాయక్, వేణుగోపాల్, మోహన్‌కుమార్, పరమేశ్వర్, ఎంఐసీ కోర్డినేటర్ గద్దల సుదర్శన్, సిబ్బంది ప్రసాద్, సురేశ్ పాల్గొన్నారు.

సింగరేణి ఎంసీ క్వార్టర్స్‌లో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ సింగరేణి ఏరియా ఆస్పత్రి వెనుక భాగంలోని ఉన్న రెండు ఎంసీ క్వార్టర్స్‌లో గుర్తుతెలియని దొంగలు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 3వగనిలో ఫోర్ మెన్ పనిచేస్తున్న సంపత్ రెడ్డి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. అదేవిధంగా అదేప్రాంతంలో కెటీకే 5వగనిలో మైనింగ్ సర్దార్ గా పనిచేస్తున్న శంకర్ పనుల నిమిత్తం సొంత గ్రామం వెళ్లారు. వారి ఇళ్లకు వేసిన తాళాలను గుర్తుతెలియని దొంగలు ధ్వంసం చేసి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రెండు ఇళ్లలో చోరీ జరిగిన విషయాన్ని ఇంటి పక్క వారు సంపత్ రెడ్డికి, శంకర్‌కు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఎంత విలువైన ఆభరణాలు నగదు డబ్బులు ఎంత మేరకు చోరీ చేశారనేది పూర్తిగా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

గనులపై సౌకర్యాలు కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: గుర్తింపు సంఘంతో యాజమాన్యం ఒప్పందం చేసుకున్న ప్రకారం గనులపై సౌకర్యాలను కల్పించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేశ్ కోరారు. శుక్రవారం ఏరియాలోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ మీటింగ్‌లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రమేశ్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు. ఇటీవల కార్మికుల నుంచి అక్రమంగా వసూలు చేసిన యాజీ అలవెన్స్‌ను కంపెనీ అవసరం కోసం సర్ఫేస్‌లో పనిచేసిన కార్మికులకు తిరిగి చెల్లించాలని కోరారు. యూనియన్‌తో జరిగిన ఒప్పందానికి అనుగుణంగా గనులలో సదుపాయాలు ఏర్పాటు చేయాలని అవసరమైన చోట ఎంఎస్, ఓఎం రూములు షెడ్లపై కప్పు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జీఎం రాజేశ్వర్ రెడ్డి స్ట్రక్చర్ సమావేశంలో చర్చించిన అంశాలన్నింటిని త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో సర్టిఫికెట్లు అందించాలి

కాళేశ్వరం: మండలంలోని విద్యార్థులకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు సకాలంలో అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్ మహదేవ్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాలు ఎంట్రెన్స్ రాసిన విద్యార్థులు, పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ పాసై తదనంతర కోర్సులో విద్యాసంస్థల్లో జాయిన్ కావడానికి వెళ్లే సమయంలో కులం, ఆదాయం సర్టిఫికేట్ అడుగుతున్నారని, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న సకాలంలో సర్టిఫికెట్స్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు

పులిహోర ప్యాకెట్ల పంపిణీ

కాటారం: సరస్వతి పుష్కరాలకు వెళ్తున్న భక్తులకు మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ తెప్పెల దేవేందర్‌రెడ్డి, తెప్పెల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పులిహోర ప్యాకేట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీపాదట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు సూచన మేరకు పుష్కరాలు పూర్తయ్యే వరకు భక్తులకు పులిహోర ప్యాకేట్లు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం సువిద్య పాఠశాల ఆధ్వర్యంలో కరస్పాండెంట్ కొట్టె శ్రీశైలం మండల కేంద్రంలో తాగునీటి కేంద్రం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, రమేశ్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



విద్యుత్ వైర్లను చూపుతున్న రైతు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామ శివారులో నల్లబెల్లి సాంబయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో చేతికి అందే విధంగా 11కేవీ వైర్లు కిందికి ఉన్నాయని బాధిత రైతు తెలిపారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కూలీలు వ్యవసాయ పనులకు రావడానికి జంకుతున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతు వేడుకుంటున్నాడు.

మొలకెత్తిన ధాన్యం



కొత్తపల్లిగోరిలో ధాన్యం కుప్పల వద్ద వర్షపు నీరు



బస్తాలో మొలకెత్తిన ధాన్యం



నీళ్లు రాకుండా తీసిన కాల్వలు

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- కాపాడుకునేందుకు రైతుల ఇబ్బందులు

రేగొండ: ఆరుగాలం కష్టపడి పండించిన పంట వరుణుడి పాలవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన, సంచుల్లో నింపిన ధాన్యం గురువారం రాత్రి కురిసిన వర్షంతో తడిసిపోయింది. మండలంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే వరిసాగు కాస్త ఆలస్యంగానే ఉంటోంది. దాదాపు ఇప్పటికే కొన్ని మండలాల్లో ధాన్యం కొనుగోల్లు పూర్తికాగా, మిగతా మండలాల్లో పూర్తయ్యే దశకు చేరాయి. కాని కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో మాత్రం ఇప్పటికీ ఇంకా కొంతమంది రైతుల పంట కోత కూడా కాకపోవడం గమనార్హం. మరో రెండు రోజుల పాటు ఇలాగే వర్షాలు ఉంటాయన్న వాతావరణ సూచనల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలులో కోతలు

కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే తేమ పేరిట కొర్రీలు పెడుతూ రైతన్నలను తిప్పలు పెడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో తేమశాతం వచ్చినా.. సీరియల్ నంబర్ వచ్చేదాకా వేచి చూడాల్సి వస్తోంది. అంతే కాకుండా రైస్‌మిల్లర్లు కూడా క్వింటాకు ఇంత అంటూ కోతలు పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి అకాలవర్షంతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

కొట్టుకుపోయిన ధాన్యం

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలోని కొనుగోలు సెంటర్‌కు రైతులు తెచ్చిన ధాన్యం గురువారం రాత్రి కురిసిన వర్షంతో పూర్తిగా తడిసిపోయి కొట్టుకపోయాయి. దీంతో రైతులు తెల్లవారుజామున కొనుగోలు సెంటర్‌లో ఉన్న ధాన్యాన్ని ఎండబెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు. ఐకేపి సెంటర్‌లో కొనుగోలు ఆలస్యం కావడం మూలంగా ధాన్యం తడిసిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నైన్‌పాకలో తడిసిన ధాన్యం

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



అకాల వర్షంతో కష్టపడి పండించిన ధాన్యం తడిసిపోయింది. నాతో పాటు చాలా మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. తడిసిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసి, మద్దతు ధర ఇప్పించాలి.

- నిమ్మల శంకర్, రైతు, కొత్తపల్లిగోరి

ధాన్యం తడిచింది..



పది రోజుల నుంచి కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం ఆరబెట్టుకుంటున్నా. అకాల వర్షంతో బస్తాలలో నింపిన ధాన్యం తడిచి మొలకేత్తాయి. ఇంకా వర్షాలు పడుతాయన్న వాతావరణ సూచనలు ఉన్నాయి. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

- సూరం రాజు, రైతు, కొత్తపల్లిగోరి

వాకీటాకీల వినియోగం



వాకీటాకీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల్లో లక్షలాది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో భద్రత, రవాణా, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసేందుకు అధికారులు వాకీటాకీ సేవలు విస్తృతంగా వినియోగిస్తున్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వాకీటాకీల ద్వారా అధికారులతో నేరుగా కమ్యూనికేషన్ ఏర్పాటు చేసి అక్కడ ఏర్పడే అత్యవసర పరిస్థితులను వెంటనే గుర్తించి, సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ ప్రాంతాలు, పార్కింగ్ జోన్లు, ఉచిత వాహన కేంద్రాలు పలు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందికి వాకీ టాకీలు అందుబాటులో ఉంచి నిరంతరంగా సమాచారం, సూచనలు అందిస్తున్నారు.

కుప్పగా పోశారు.. వదిలేశారు



కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ సమీపంలో వర్షం కారణంగా నీరు నిల్వడంతో బురదమయంగా మారిపోయింది. దీంతో భక్తులు నడవడానికి ఇబ్బందిగా మారడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు పరిసర ప్రాంతాల్లో సిమెంట్, కంకర మిక్స్‌ను ఓ కుప్పగా పోశారు. బురద ఉన్న చోట ఆ మిక్స్‌ను చదును చేయకుండా అలానే వదిలేశారు.

స్టోర్ ఏర్పాటు



మల్హర్: పుష్కరాల నేపథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులు సామగ్రిని భద్రపరుచుకునే విధంగా ఉచిత ర్యాక్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. కాళేశ్వర సరస్వతి నది ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానం అచరించిన అనంతరం కాళేశ్వర ఆలయంలో దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు తమ సామగ్రిని భద్రపరచుకోవడానికి దేవదాయ శాఖ నిర్వాహకులు ఇనుప ర్యాక్‌ల స్టోర్‌లో భద్రపరుస్తున్నారు. అలాగే కొందరు ప్రైవేట్ వ్యక్తులు మాత్రం భక్తుల సామగ్రిని భద్రపేరుచుకోవడానికి రూ. 20 వసూల్ చేస్తున్నారు.

నిత్యాన్నదానం



మల్హర్: సరస్వతి పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం వచ్చే భక్తుల కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి గెస్ట్‌హౌజ్ ఆవరణలో నిత్య అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ సత్రం ద్వారా ప్రతి రోజు 3వేల నుంచి 5వేల భక్తులకు ఉదయం టిఫెన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సుమారు ఎనిమిది అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. 12 రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నదానం చేపడుతున్నట్లు భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వాహనాల లెక్క పక్కాగా..



కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాలకు వస్తున్న భక్తుల వాహనాలను అధికారులు పక్కాగా లెక్కిస్తున్నారు. ప్రతీ రోజు పుష్కరాలకు ఎన్ని వాహనాలు వస్తున్నాయి. ఎన్ని వాహనాలు వెళ్తున్నాయని పోలీస్ సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో ప్రత్యేకంగా నియమించిన ఓ పోలీస్ సిబ్బంది వచ్చిపోయే వాహనాల వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో పుష్కరాల సమయంలో కాళేశ్వరం ఎన్ని వాహనాలు అనే వివరాలు స్పష్టంగా తెలియడం కోసం ఈ లెక్కింపు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తుల సేవలో పోలీసులు



చిట్యాల: కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాల్లో తొమ్మిదవ రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈక్రమంలో సరస్వతి ఘాట్ వద్ద నడవలేని స్థితిలో ఇబ్బంది పడ్డ ఓ వృద్ధురాలును పోలీసులు నదీతీరం నుంచి కుర్చీలో కూర్చోబెట్టి మోస్తూ మెట్లు ఎక్కించారు.

బస్సుల కోసం భక్తుల ఇక్కట్లు



పలిమెల: కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాలకు భారీగా వస్తున్న భక్తులకు తిరుగు ప్రయాణంలో బస్సులు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు భక్తుల సౌకర్యార్థం బస్సులను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



పలిమెల: ద్విచక్ర వాహనంపై సరస్వతి నది పుష్కరాలకు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు ప్రయాణంలో మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీకి చెందిన వృద్ధ దంపతులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ముందుగా వెళ్తున్న పోలీసు వాహనం హరితహోటల్ ముందు ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడంతో వెనకాలే ఉన్న ద్విచక్ర వాహనదారులు పోలీస్ వాహనానికి ఢీకొట్టారు. కాగా వారు స్వల్ప గాయాలతోనే బయటపడ్డారని తెలిపారు.

సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూటీం



పలిమెల: సరస్వతి నది పుష్కరాల్లో సింగరేణి రెస్క్యూ టీం భక్తులకు సహాయక చర్యలు చేపడుతుంది. దీంట్లో భాగంగా హైదరాబాద్ నుంచి పుష్కరాలకు వచ్చిన సావిత్రి అనే మహిళ కళ్లు తిరిగి పడిపోగా సింగరేణి రెస్క్యూటీం సిబ్బంది మారెపల్లి బాబు, సంజీవ్, శ్రీనివాస్, వినీస్ సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.